# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలను అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

- ❖ స్మార్ట్ వ్యవసాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.

- ❖ గ్రామీణ మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ లో జాతీయ స్థాయి సరస్ ఆజీవికా మేళాను నిర్వహించనున్నట్టు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

- ❖ రాయలసీమను సస్యశ్యామల రత్నాలసీమగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

======================

గత సంవత్సరం కంటే ఈ ఏడాది రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపిబి) ఈరోజు సమావేశమైంది. ఈ సమావేశంలో మొత్తంగా 14 సంస్థలకు చెందిన 19 వేల 391 కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 11 వేల 753 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదే విధంగా విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, 2029 నాటికి వీటి ధరను 3 రూపాయల 70 పైసలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

======================

రాష్ట్రంలో వ్యవసాయ రంగం సాంకేతికత, ఖచ్చితత్వం, స్థిరమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడలోని సమగ్ర జలవనరుల నిర్వహణ, రైతు శిక్షణ కేంద్రంలోని రాష్ట్ర ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. నీటి వనరుల తగ్గుదల, వాతావరణ మార్పులు, సాగు వ్యయాల పెరుగుదల వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు వ్యవసాయాన్ని స్మార్ట్ వ్యవసాయంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. స్మార్ట్ వ్యవసాయంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి ఆదర్శంగా నిలుపుతామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

=====================

రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయనగరం జిల్లా రాచకిండాం గ్రామంలో ఈరోజు పర్యటించిన మంత్రి ధాన్యం నిల్వలు, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎటువంటి కష్టం రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి అడుగు రైతు సంతోషం, సంక్షేమం కోసమేనని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

గ్రామీణ మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంచే ఉద్దేశ్యంతో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ లో జాతీయ స్థాయిలో సరస్ ఆజీవికా మేళాను నిర్వహించనున్నట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో సరస్ ప్రాంగణాన్ని ఆయన ఈరోజు సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ... ఈ నెల 8వ తేదీ నుండి 10 రోజుల పాటు ఈ మేళను నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టేట్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ రాష్ట్రాలలో నిర్వహించే ఈ మేళాలు జాతీయ స్థాయిలో ఢిల్లీలో మాత్రమే నిర్వహిస్తారని, తొలిసారిగా గుంటూరుకు ఆ అవకాశం దక్కిందని వివరించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.

విరామం

=====================

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో మైన్స్ శాఖ పనితీరుపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో ఇసుక విధానాల్లో జరిగిన లోపాల కారణంగా భవన నిర్మాణ రంగం వెనుకబడిందని, ఇప్పుడు అలా జరగకుండా అధికారులు అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల నిర్వాహకులు అపరాధ రుసుములపై చేసిన ఆరోపణలను పరిశీలిస్తామని, అయితే చట్టబద్ధమైన విధానాలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

రాయలసీమను సస్యశ్యామల రత్నాలసీమగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ... ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై చూపిన ప్రత్యేక శ్రద్ధ కారణంగా రాయలసీమలో జలాశయాలు, చెరువులు అన్నీ జలకళతో ఉట్టిపడుతున్నాయన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల భద్రతా పరిరక్షణ దిశగా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందని, దీని కారణంగా ప్రతి సాగునీటి ప్రాజెక్టు, రిజర్వాయర్లు పునరుద్ధరించబడ్డాయని తెలిపారు. రైతులు రెండో పంట కూడా సాగు చేయగలుగుతున్నారని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

======================

గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ... సుమారు 19 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రి గిరిజన ప్రాంతంలో కీలక వైద్య కేంద్రంగా మారనుందన్నారు. అనంతరం గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానం నేటి తరాలకు తెలియజేసేందుకు అభివృద్ధిపరిచిన ట్రైబల్ మ్యూజియాన్ని మంత్రి ప్రారంభించారు.

======================

భారత్ - అమెరికా వాణిజ్య సంబంధాల మూల్యాంకనం అనే అంశంపై అధ్యయనం చేసేందుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ కామర్స్  విశాఖపట్టణంలో ఈరోజు పర్యటించింది. కమిటీ చైర్మన్ డోలా సేన్ అధ్యక్షతన నగరంలోని ఓ హోటల్ లో జరిగిన అధ్యయన సమావేశంలో 15 మంది సభ్యుల బృందం పాల్గొంది. బృందంలో సభ్యుడిగా వున్న విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం. శ్రీభరత్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. మత్స్య పరిశ్రమ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా MPEDA చైర్మన్ డి.వి.స్వామి వివరించారు. ఈ సమావేశానికి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్, మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్ పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ ప్రతినిధులు హాజరయ్యారు.

======================
======================